సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం : 5, ఫిబ్రవరి : 2025



పక్కాగా పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 8లో



.. నీటి సరఫరాకు కృషి

వచ్చే వేసవిలో మిషన్ భగీరథ పథకం ద్వారా అంతరాయం లేకుండా తాగునీరు సరఫరా చేయాలని సీఈ కె.శ్రీనివాస్ అన్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
35° / 19°

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి వాతావరణం మాత్రం కొంతమేర చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అడవులను అభివృద్ధి చేద్దాం

పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ



స్మృతివనాన్ని పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ సువర్ణ, అధికారులు

చంద్రుగొండ : అడవులను అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (కంపా) డాక్టర్ సువర్ణ అన్నారు. మండలంలోని బెండాలపాడు శివారులో ఉన్న దివంగత రేంజర్ చలమల శ్రీనివాసరావు స్మృతివనాన్ని మంగళవారం ఆమె సీసీఎఫ్ భీమానాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడవులను మరింత అభివృద్ధిగా చేస్తేనే సమాజానికి మేలు జరుగుతుందని అన్నారు. దివంగత రేంజర్ చలమల శ్రీనివాసరావు హత్య బాధాకరమన్నారు. ఉద్యోగ రీత్యా ఆయన పనితీరు అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో భద్రాద్రి, ఖమ్మం డీఎఫ్‌ఓలు కిష్టాగౌడ్, సిద్దార్థ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, రేంజర్ ఎల్లయ్య పాల్గొన్నారు.

మేలైన పంటలనే సాగు చేయాలి

కేవీకే కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ, ఏడీఏ లాల్‌చంద్



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

టేకులపల్లి: తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి, లాభాలు వచ్చే మేలైన పంటలనే సాగు చేసి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ, శాస్త్రవేత్త బి.శివ, ఇల్లెందు ఏడీఏ జి. లాల్‌చంద్ సూచించారు. మండలంలోని తొమ్మిదో మైలుతండాలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మునగ, ఆయిల్‌పామ్, కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు పండిస్తేనే లాభాలు ఎక్కువగా వస్తాయని వివరించారు. అనంతరం మిర్చి, మొక్కజొన్న పంటల క్షేత్రాలను సందర్శించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

పారాయణ మహోత్సవానికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులు

భద్రాచలంటౌన్: ఈనెల 8న భీష్మ ఏకాదశి సందర్భంగా భద్రాచలంలో చిన్నజీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగే విరాట్ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరిగే ఈ కార్యక్రమానికి 15 నుంచి 20 వేల మంది భక్తులు హాజరవుతారని తెలిపారు. ప్రతీ ఒక్కరికి విష్ణుసహస్రనామ స్తోత్ర పుస్తకాలను ఉచితంగా అందజేస్తామని, పారాయణం పూర్తయ్యాక ప్రసాదం పంపిణీ ఉంటుందని వివరించారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో మురళీకృష్ణమాచార్యులు, వెంకటాచార్యులు, చక్రవర్తి, కమలకుమారి, చారుగుళ్ల శ్రీనివాస్, తాళ్లపూడి రాము, భద్రమారుతి నాగేశ్వరావు, అల్లం నాగేశ్వరరావు, సీతామహాలక్ష్మి, చిట్టే లలిత, వనజమణి ఉన్నారు.

పీసీసీఎఫ్ పర్యటన వాయిదా

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) ఆర్.ఎం.డోబ్రియల్ మంగళవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించాల్సి ఉంది. అయితే అనివార్య కారణాలతో ఆయన పర్యటన వాయిదా పడిందని ఎఫ్‌డీఓ బాబు తెలిపారు.

ముందస్తుతోనే మేలు..



భద్రాచలంలో పుష్కర ఘాట్‌లపై కూర్చుని తెప్పోత్సవం తిలకిస్తున్న భక్తులు (ఫైల్)

2027లో గోదావరి నదికి పుష్కరాలు

- భద్రాచలం వద్ద ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలంటున్న నిపుణులు
- నూతన ఘాట్లు నిర్మించాలని భక్తుల వేడుకోలు
- సౌకర్యాలు మెరుగుపర్చాలని డిమాండ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో పుణ్యస్నానాలు చేసేందుకు దేశం నలుమూలల నుంచి భక్తులు త్రివేణి సంగమానికి బారులుదీరుతున్నారు. జీవనదుల్లో పుణ్యస్నానాలు చేసేందుకు భక్తజనం చూపించే ఆసక్తికి కుంభమేళా నిదర్శనం. ప్రస్తుతం రాష్ట్రంలో సరస్వతీ పుష్కరాలకు సంబంధించిన పనులు కాళేశ్వరంలో జరుగుతున్నాయి. అయితే నిధులు మంజూరైన తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలంలో ముందుస్తుగా ప్రణాళిక సిద్ధం చేయడం మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పుష్కరాలకు మరో రెండేళ్లు..

2003, 2015లో గోదావరి నదికి పుష్కరాలు వచ్చాయి. ఈ సందర్భంగా భద్రాచలంలో గోదావరి తీరం వెంట గమనించదగ్గ స్థాయిలో కరకట్ట నిర్మాణం, స్నానఘట్టాలు వంటి అభివృద్ధి పనులు జరిగాయి. మళ్లీ 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. వీటి ఏర్పాట్లకు నిధులు మంజూరవుతాయి. అయితే గతంతో పోల్చితే రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రాష్ట్ర విభజన కారణంగా భద్రాచలం క్షేత్రానికి స్థల సమస్య ఏర్పడింది. పట్టణ పరిధి దాటితే ఇంచు భూమి కూడా తెలంగాణలో లేదు. దీంతో నిర్మాణ పరమైన అభివృద్ధిని పక్కన పెడితే కనీసం పార్కింగ్ స్థలం కోసం కూడా కటకటలాడాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఈ నేపథ్యంలో పుష్కరాలకు సంబంధించి భద్రాచలంలో ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే అంశంపై ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

ఏపీలోకి ఆ ఐదు గ్రామాలు..

ఒక్క రోజు జరిగే వేడుకలైన శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి, వినాయక నిమజ్జనం, హనమాన్ జయంతి వంటి పర్వదినాల్లోనే భద్రాచలం కిక్కిరిసిపోతుంటుంది. గోదావరి వంతెన దాటిన తర్వాత అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంతో పాటు జూనియర్ కాలేజీ మైదానం, వ్యవసాయ మార్కెట్ స్థలాలు పార్కింగ్ అవసరాలను తీరుస్తున్నాయి. కానీ కరోనా తర్వాత వ్యక్తిగత వాహనాల వినియోగం పెరిగింది. పుష్కర స్నానాలకు కుటుంబ సమేతంగా భక్తులు వస్తుంటారు. దీంతో రాబోయే పుష్కరాలకు వేలాది వాహనాలు పన్నెండు రోజుల పాటు భద్రాచలం వైపు పరుగులు పెట్టనున్నాయి. దీనికి తగ్గట్టుగా చర్ల, కూనవరం రోడ్లలో పార్కింగ్ ఏర్పాట్లు చేసే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఏపీలో కలిసిన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలనే అంశంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కొత్త ఘాట్లు నిర్మిస్తే మేలు..

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఉండడంతో ముఖ్యమంత్రి, గవర్నర్ వంటి ప్రముఖులు, సెలబ్రిటీలు, వీఐపీలు, ఇరు రాష్ట్రాల నుంచి భక్తులు భద్రాచలంలో పుష్కర స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. ప్రస్తుతం భద్రాచలంలో సామాన్య భక్తుల పుష్కర ఘాట్, బూర్గంపాడు మండలం మోతె దగ్గర వీఐపీ ఘాట్ ఉన్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే వారంతా ప్రధాన ఘాట్‌కే వస్తారు. దీంతో ఈ ఘాట్‌ను మరింతగా విస్తరిస్తే ఒకేచోట భక్తుల రద్దీ పెరిగే అవకాశముంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన ఘాట్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త ఘాట్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని భక్తులు కోరుతున్నారు. ఈ కొత్త ఘాట్‌ల నుంచి ఆలయం వరకు భక్తులు వచ్చిపోయే రహదారులను సైతం విస్తరించాల్సిన అవసరం ఉంది.

నిత్యం ఉపయోగించేలా

పుష్కరాలకు మంజూరయ్యే నిధులతో చేపట్టే నిర్మాణాలు కేవలం పుష్కరాలకే అన్నట్టుగా కాకుండా నిత్యం ఇక్కడికి వచ్చే భక్తులకు ఉపయోగపడేలా జాగ్రత్తలు తీసుకోవాలి. భక్తులు సామూహికంగా బస చేసేందుకు వీలుగా హాళ్లు, లాకర్లు సరిపడా అందుబాటులో లేవు. అలాగే టాయిలెట్లు, స్నానాల గదులు కూడా ఆశించిన స్థాయిలో లేవు. పుష్కర ఏర్పాట్లలో వీటికి ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ భక్తుల నుంచి వస్తోంది. ఇటీవల జరిగిన తెప్పోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు కనులారా చూసేందుకు అంఫీ థియేటర్ తరహాలో గతంలో నిర్మించిన పుష్కరఘాట్లు ఉపయోగపడ్డాయి. ఇప్పుడు ఈ ఘాట్లపై నీడ ఉండేలా షెడ్‌లు అందుబాటులోకి తెస్తే ఎండ, వానల నుంచి భక్తులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈ విషయాలపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

మహా కుంభాభిషేకానికి ముస్తాబు





విద్యుత్‌కాంతులతో శోభిల్లుతున్న పెద్దమ్మతల్లి ఆలయం(ఇన్‌సెట్) అమ్మవారు

- పెద్దమ్మతల్లి ఆలయంలో రేపటి నుంచి వేడుకలు
- ఐదు రోజుల పాటు పంచమ పుష్కర ఉత్సవాలు
- విద్యుద్దీపాల అలంకరణతో శోభిల్లుతున్న ఆలయం

పాల్వంచరూరల్ : కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా, భక్తులకు వరాలు ఇస్తూ చల్లగా చూసే అమ్మగా పేరుగాంచిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారిని నిత్యం వందలాది మంది భక్తులు దర్శించుకుంటారు. ముఖ్యంగా గురు, ఆదివారాలతో పాటు పండుగ రోజుల్లో వేల సంఖ్యలో తరలివస్తుంటారు. ఈ అమ్మవారి ఆలయం నిర్మించి 64 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా గురువారం నుంచి ఐదు రోజుల పాటు పంచమ పుష్కర(షష్టాబ్ది) ఉత్సవాలు, మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే అని విశ్వసించే వేలాది మంది భక్తులు ఈ ఉత్సవాలకు తరలిరానున్నారు. ఇందుకోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పూజా కార్యక్రమాలు ఇలా..

6వ తేదీ ఉదయం 6 గంటలకు మంగళతోరణాలతో ఆలయాన్ని అలంకరిస్తారు. 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యావాచనం, అఖండ దీపారాధన, దీక్షాధారణ, గోపూజ వంటివి నిర్వహిస్తారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై ఈ పూజా కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఆ తర్వాత విశేష పూజలు, అర్చనలు ఉంటాయి. 7వ తేదీ తెల్లవారుజాము నుంచి పుణ్యావాచనం, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమాలు జరుగుతాయి. అమ్మవారి సన్నిధి పక్కనే నిర్మించిన శివాలయంలో ప్రతిష్ఠామూర్తులకు జలాధివాసం చేయనున్నారు. శివాలయంతో పాటు పక్కన నిర్మించిన అన్నదాన సత్రం, యాగశాల, కల్యాణ మండపం భక్తులను ఆకట్టుకునేలా ఉన్నాయి.

విద్యుత్ దీపాలతో అలంకరణ..

మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య శ్రీ కనకదుర్గ(పెద్దమ్మ తల్లి) ఆలయాన్ని 1961లో నిర్మించారు. ఇప్పటికి 64 ఏళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా అవధానులు పరమేశ్వరప్రసాద్, శివసంతోష్‌కుమార్ శర్మ అధ్వర్యంలో మహా కుంభాభిషేక మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా వాల్ పోస్టర్లు, కరపత్రాలతో పాటు ప్రత్యేక రథం ద్వారా ప్రచారం చేశారు. వేడుకల కోసం ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. దీంతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ఏర్పాట్లు పూర్తి చేశాం



పెద్దమ్మతల్లి ఆలయాన్ని నిర్మించి 64 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా పంచమ పుష్కర(షష్టాబ్ది) మహా కుంభాభిషేక ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. దాతల సహకారంతో పాటు ఆలయ నిధులతో ఇటీవల నిర్మించిన శివాలయంలోనూ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపడుతున్నాం. అన్నదాన సత్రం, కల్యాణ మండపం ప్రారంభించనున్నాం. మాఘశుద్ధ త్రయోదశి రోజున శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నాం.

– ఎన్.రజనీకుమారి, ఈఓ

ఎస్సెస్సీలో మెరుగైన ఫలితాల సాధనకు కృషి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్



విద్యార్థి సామర్థ్యాలను పరీక్షిస్తున్న పీఓ రాహుల్

బూర్గంపాడు: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, వార్డెన్లు దృష్టి సారించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. బూర్గంపాడు మండలం ఉప్పుసాకలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు అపరిశుభ్రంగా ఉండటం, సైన్స్ ల్యాబ్ నిర్వహణ తీరు సరిగా లేకపోవడంతో హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో సమావేశమైన పీఓ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, లేదా, బోధన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యాన చదువుపై శ్రద్ధ కనబర్చాలని, పరీక్షలంటే భయాన్ని విడనాలని సూచించారు. కాగా, ప్రత్యేక తరగతుల నిర్వహణ, కౌన్సెలింగ్, పౌష్టికాహారం సరఫరాపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాల హెచ్‌ఎం భీమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

చుంచుపల్లి: భద్రాచలం, సారపాక గ్రామపంచాయతీల్లో ఓటరు జాబితా వివిధ దశల తయారీ, ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణకు రాజకీయ నాయకులు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం.విద్యాచందన కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం ఐడీఓసీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భద్రాచలంలో 41,008 మంది, సారపాకలో 19,044 మంది ఓటర్లు ఉన్నారని, ఈ జాబితాలో ఏదైనా తప్పులు లేదా మార్పులు ఉంటే లిఖిత పూర్వకంగా స్థానిక ఎంపీడీఓలకు 6వ తేదీ సాయంత్రంలోగా అందజేయాలన్నారు. 7వ తేదీన తుది జాబితా విడుదల చేస్తామని వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రాష్ట్రస్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు జిల్లా క్రీడాకారులు హాజరై మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు.

14న నులిపురుగుల నివారణ దినోత్సవం



బస్తీ దవాఖానా సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

పాల్వంచరూరల్ : ఈనెల 14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆల్బెండజోల్ మందులు పంపిణీ చేయాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులను గుర్తించి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయాలని, శిశు మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీబీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వైద్య చికిత్స అందించాలని అన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ బాలాజీ, ఉల్వనూరు పీహెచ్‌సీ వైద్యురాలు తేజశ్రీ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలో తనిఖీ..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ఏ పవర్ హౌస్ బస్తీలోని దవాఖానాను డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఓపీ సేవలు ఎలా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ మందులు అందుబాటులో ఉంచాలని, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఎప్పటికప్పుడు మందులు పంపిణీ చేయాలని చెప్పారు. ఆస్పత్రిలో నెలకొన్న తాగునీటి సమస్యను సిబ్బంది ఆయన దృష్టికి తేగా కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి తాగునీటిని సదుపాయం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు రాకేష్, పాయం శ్రీనివాస్, హెచ్‌ఈఓ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వేసవిలో తాగునీటి సరఫరాలో సమస్య తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మండల స్థాయి సమావేశాలు నిర్వహించాలని మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్‌ను ఆదేశించారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, మిషన్ భగీరథ ఏఈ, పంచాయతీ సెక్రటరీలు కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ఎక్కడైనా తాగునీటి సరఫరాలో సమస్యలు ఉన్నట్టు గుర్తిస్తే వెంటనే పరిష్కరించాలని అన్నారు. అవసరమైన చోట చేతి పంపులు, బోరు మోటార్లు, పైప్‌లైన్ల మరమ్మతులు సకాలంలో చేపట్టాలని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 18005994007 కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు.

రామాలయంలో ఘనంగా రథ సప్తమి వేడుకలు



సూర్యప్రభ వాహనంపై తిరువీధి సేవలో పాల్గొన్న ఈఓ, అర్చకులు, సిబ్బంది

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా వేడుకలను ఘనంగా జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారిని పల్లకీసేవగా చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం సూర్యప్రభ వాహనంపై తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు వేద పారాయణం చేశారు. సాయంత్రం చంద్రప్రభ వాహనంపై తిరువీధి సేవ జరిగింది. ఈ ఏడాది తొలిసారిగా సూర్యోదయ సమయంలోనే సూర్యప్రభ వాహనంపై తిరువీధి సేవ నిర్వహించామని, ఆదిత్య ఉదయం స్తోత్రం, శ్రీరామస్తుతిని స్థానాచార్యులు గావించారని అర్చకులు తెలిపారు. ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, అధికారులు, సిబ్బంది, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

కమనీయంగా కల్యాణం..

దేవస్థానంలో స్వామి వారికి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడామండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం సందర్భంగా శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, తమలపాకులతో అర్చన గావించారు.

4.13 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల, పక్కన బిజినెస్ మేనేజర్ సందీప్

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో గడిచిన వానాకాలం సీజన్‌కు సంబంధించి రూ.116.49 కోట్ల విలువైన 4.13 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోళ్లు చేసినట్లు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మంలోని కార్యాలయంలో మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో 29 కేంద్రాల ద్వారా రూ.89.71 కోట్ల విలువైన 3.18 లక్షల క్వింటాళ్లు, భద్రాద్రి జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.26.78 కోట్ల విలువైన 94,960 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. గతంలో ఖమ్మం జిల్లాలో మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేపట్టగా, ఈసారి భద్రాద్రి జిల్లాలోనూ కేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపారు. వచ్చే ఏడాది ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను మరింతగా విస్తృత పరుస్తామని ఆయన వెల్లడించారు. డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా బిజినెస్ మేనేజర్ కె.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పక్కదారి పడితే ఉపేక్షించం



రేషన్ దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న డీటీ శివకుమార్

మణుగూరుటౌన్: రేషన్ బియ్యం పక్కదారి పడితే ఉపేక్షించేది లేదని డీటీ శివకుమార్ డీలర్లను హెచ్చరించారు. మంగళవారం 'సాక్షి'లో 'జోరుగా రేషన్ బియ్యం విక్రయాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత మణుగూరు ఏరియాలోని ఈశ్వరమ్మ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి స్టాక్ రికార్డులను పరిశీలించారు. డీలర్‌తో ఆయన మాట్లాడుతూ.. రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కి తరలించినట్లు తమ దృష్టికి వస్తే ఆకస్మికంగా తనిఖీలు చేసి సీజ్ చేస్తామని, బియ్యం కార్డులు ఉన్న లబ్ధిదారులకు చేరాలని సూచించారు.

సోలార్ ప్లాంట్ సమీపాన గుట్టపై మంటలు



గుట్టపై ఎగిసిపడుతున్న మంటలు

కారేపల్లి: ఇల్లెందు – సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి సరిహద్దుల్లో ఉన్న సోలార్ ప్లాంట్ సమీపాన గుట్టపై మంగళవారం రాత్రి మంటలు చెలరేగాయి. గుట్టపై ఎండిన కొమ్మలు, ఆకులకు నిప్పంటుకోవడంతో మంటలు ఎగిసిపడ్డాయి. సమీపాన సోలార్ ప్లాంట్ ఉండటంతో అప్రమత్తమైన అధికారులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చి సిబ్బంది సాయంతో మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నారు. అయితే, గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారా లేక ఘటనకు ఇతర కారణాలు ఉన్నాయా అనేది తెలియరాలేదు.

కేటీపీఎస్ కాలనీ డంపింగ్ యార్డ్‌లో...



ఫైర్ ఇంజన్‌తో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

పాల్వంచ: పట్టణంలోని కేటీపీఎస్ బీ–కాలనీ డంపింగ్ యార్డ్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ రావడంతో కాలనీ వాసులు ఆందోళనకు గురయ్యారు. కేటీపీఎస్ ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

గంజాయి రవాణా కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు

కొత్తగూడెంటౌన్/టేకులపల్లి : గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురు వ్యక్తులు నేరం చేసినట్లు రుజువు కావడంతో ఒక్కొక్కరికీ పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. 2019, నవంబర్ 11న టేకులపల్లి ఎస్‌ఐ జి.ప్రవీణ్‌కుమార్.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికి చెందిన భూక్యా రాము, బోడా సుమన్, నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి పల్లిపాడుకు చెందిన బొంతు శంకరయ్య ఆటోలో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఐదుగురు సాక్షులను విచారించిన జడ్జి.. ముద్దాయిలపై నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ ఏపీపీ పీవీడీ లక్ష్మి వాదించగా.. కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్‌కే అబ్దుల్ ఘని, పీసీ పులి రమేశ్ సహకరించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం, ఏటీడీఓపై కేసు

కారేపల్లి: మండలంలోని రేలకాయపల్లి ఆశ్రమ పాఠశాల బాలురపై డిప్యూటీ వార్డెన్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తేలడంతో సస్పెండ్ చేయడమే కాక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశారు. అయితే, ఘటనపై పోలీసుల సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం(ఎఫ్‌ఏసీ) ఎస్.శ్రీనివాసరావు, విచారణ చేపట్టిన ఏటీడీఓ జహీరుద్దీన్‌పైనా కారేపల్లి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. గతనెల 20వ తేదీన డిప్యూటీ వార్డెన్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినా అంతర్గత విచారణ చేపట్టారే తప్ప తమకు సమాచారం ఇవ్వనందున కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,487

పక్కాగా పౌష్టికాహారం

- ఫొటో గుర్తింపుతో సరుకుల పంపిణీ
- అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలుకు ఆదేశాలు



భద్రాచలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ఆటలు ఆడిస్తున్న టీచర్

భద్రాచలంఅర్బన్: అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సజావుగా అందించేందుకు ప్రణాళిక రూపొందించింది. కేంద్రాలకు సరఫరా చేసే సరుకులు పక్కదారి పట్టకుండా టీహెచ్ఆర్ (టేక్ హోం రేషన్) తీసుకెళ్లే లబ్ధిదారు ఫొటోను తీసి పోషణ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. చిన్నారులకు అందించే సరుకు తీసుకెళ్లే వారి చిత్రాన్ని ఇక నుంచి ఆన్‌లైన్‌లో పెట్టనున్నారు.

బయోమెట్రిక్‌తో హాజరు..

దుమ్ముగూడెం ఐసీడీఎస్ పరిధిలోని రెండు మండలాల్లో మొత్తం 173 కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో మొత్తం 5,300 చిన్నారులున్నారు. పారదర్శకంగా కేంద్రాల నిర్వహణ కొనసాగించేందుకు ముఖం గుర్తింపు హాజరు విధానాన్ని ముందుగా మూడేళ్లలోపు చిన్నారులకు వర్తింపజేయనున్నారు. వీరికి టీహెచ్ఆర్, బాలామృతం అందిస్తున్నారు. ఈ వివరాలను పోషణ్ అభియాన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇందులోనే ప్రస్తుతం ముఖ గుర్తింపు (ఫేస్ అథెంటికేషన్) ఆప్షన్ తీసుకొచ్చారు. ఇందులోనే వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఆధార్, ఫొటో, లబ్ధిదారుల ఫోన్ నంబర్ నమోదు చేస్తారు. ఇది పూర్తికాగానే లబ్ధిదారుడి ఫోన్‌కు వచ్చిన వన్‌టైం పాస్‌వర్డ్‌ను యాప్‌లో పొందుపరిస్తే ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం సరుకులు, బాలామృతం అందించిన ప్రతిసారి ఫేస్ అథెంటిక్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ విజయవంతమైతే 3 – 5 ఏళ్లలోపు చిన్నారులకు గర్భిణులు, బాలింతలకు అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

పంపిణీ ఇలా..

కేంద్రాల్లో 3 – 6 ఏళ్లలోపు నమోదైన వారికి నిత్యం 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, నూనె, గుడ్డు, మురుకులు, బాలామృతం అందజేస్తున్నారు. అదేవిధంగా 7 నెలల నుంచి మూడేళ్ల చిన్నారులకు టేక్ హోం రేషన్‌గా నెలకు 2.5 కిలోల బాలామృతం, నెలకు 16 గుడ్లు (వారానికి 4) అందిస్తున్నారు. అదే గర్భిణులు, బాలింతలకు అయితే ప్రతి రోజు 150 గ్రాముల బియ్యం, 30 గ్రాముల పప్పు, 50 గ్రాముల కూరగాయలు, 16 గ్రాముల నూనె, 200 మి.లీ పాలు, ఒక గుడ్డును అందజేస్తున్నారు. అంగన్‌వాడీలో నమోదైన మూడేళ్లలోపు చిన్నారులకు ఇంటి వద్దనే ఈ పౌష్టికాహార సరుకులను అందజేస్తున్నారు. ఇవి పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా బోగస్‌లకు అడ్డుకట్ట వేయాలని మాతా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. చిన్నారులకు సంబంధించి కేంద్రం నుంచి సరుకులు తీసుకెళ్లే వారి ఫొటోను పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయనున్నారు. ముందుగా వారి వివరాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. కాగా, ఫొటో గుర్తింపు ధ్రువీకరణ నమోదు చేసేందుకు ఇంటర్నెట్ సమస్యగా మారింది. దుమ్ముగూడెం ఐసీడీఎస్ పరిధిలోని 20 అంగన్‌వాడీ సెంటర్లలో ఇంటర్నెట్ సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

తొలుత మూడేళ్లలోపు చిన్నారులకు..

అంగన్వాడీ కేంద్రంలో నమోదైన మూడేళ్లలోపు చిన్నారులకు ముఖ ధ్రువీకరణ కార్యక్రమాన్ని తొలుత అమలు చేయనున్నారు. లబ్ధిదారుల వివరాలన్నీ పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేశారు. తాజాగా అదే యాప్‌లో చిన్నారుల ఫేస్ అథెంటికేషన్ చేపట్టనున్నారు. ముందుగా లబ్ధిదారుల ఆధార్ వారి ఫోన్‌కు లింక్ చేసి ఉండాలి. అలాంటి వారి వివరాలు, ఫొటోను యాప్‌లో నమోదు చేసిన తర్వాత లబ్ధిదారుల మొబైల్ ఫోన్‌కి వన్‌టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దీన్ని యాప్‌లో నమోదు చేయడం ద్వారా ధ్రువీకరణ పూర్తవుతుంది. లబ్ధిదారుల ఆధార్ ఇతర వివరాలను ఒకేసారి నమోదు చేస్తారు. తర్వాత ప్రతి నెలా పౌష్టికాహారం అందించే సమయంలో ఫొటో మాత్రమే తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు. కాగా, మూడేళ్లలోపు చిన్నారులకు ఆధార్ కార్డులు ఉండకపోతే తల్లిదండ్రులు లేదా సంరక్షకుల ఆధార్ అనుసంధానం చేసి పిల్లల ఫొటోలను తీసుకోనున్నారు. ఈ ప్రక్రియను క్రమంగా అంగన్వాడీ కేంద్రంలో లబ్ధిదారులందరికీ అమలు చేయనున్నారు.

వివరాల నమోదు..



సరుకుల పంపిణీలో అక్రమాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఫొటో గుర్తింపు విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. అయితే ఇందుకు సంబంధించి ఐసీడీఎస్ పరిధిలో గల టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తాం. లబ్ధిదారులు వారి ఆధార్ నంబర్‌ను మొబైల్ ఫోన్‌తో లింక్ చేసుకుని ఉండాలి. ఈ మేరకు టీచర్లు కేంద్రాల నుంచి సరుకులు తీసుకెళ్లే వారి వివరాలను నమోదు చేయనున్నారు. ఈ విధానంతో అవకతవకలకు అడ్డుకట్ట పడనుంది. కాగా ఇది పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటాం.

–జ్యోతి, సీడీపీఓ, దుమ్ముగూడెం ప్రాజెక్ట్

ప్రజా పోరాటాల్లో క్రియాశీలకం కావాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

భద్రాచలంటౌన్: నేటి యువత, విద్యార్థులు ప్రశ్నించే తత్వంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని దోపిడీ, పీడన, కుల, మత అణిచివేత లేని సమానత్వ సమాజ స్థాపన కోసం జరిగే ప్రజా పోరాటాల్లో క్రియాశీలక భాగస్వాములు కావాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. భద్రాచలం పట్టణంలో ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత తెలంగాణ పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మతోన్మాద ఫాసిజాన్ని పెంచి పోషిస్తూ దేశ సంపదను అంబానీ, అదానీ, టాటా, బిర్లా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని ఆరోపించారు. దేశంలో పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న ప్రజాస్వామిక వాదులు, కవులు, కళాకారులు, విప్లవ కమ్యూనిస్టులను నక్సలైట్ల పేరిట భౌతికంగా నిర్మూలించాలనుకోవడం రాక్షస చర్యలకు నిదర్శనాలని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం–2020 దేశ లౌకిక, ప్రజాస్వామ్య, సమానత్వ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని దుయ్యబట్టారు. కాగా, తొలి రోజు 'మతోన్మాద ఫాసిజం – విద్యారంగంపై దాని ప్రభావం'అనే అంశంపై విద్యా పరిరక్షణ కమిటీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు రమేశ్‌పట్నాయక్ బోధించారు. 'భారత జాతీయోద్యమంలో విప్లవ విద్యార్థుల పాత్ర'అంశంపై పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆవుల అశోక్ ప్రసంగించారు. జనరల్ కౌన్సిల్ ప్రారంభానికి ముందు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ బిగిపిడికిలి జెండాను ఆవిష్కరించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ విప్లవ విద్యార్థి అమరవీరులను స్మరిస్తూ సంతాప తీర్మానం ప్రవేశపెట్టి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెచ్చల రంగారెడ్డి, హన్మేశ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, కాంపాటి పృథ్వీ, అనిల్, నరేందర్, భాస్కర్, అఖిల్, ప్రవీణ్, సాయి, సురేశ్, నరేందర్, వెంకటేశ్, సీతారాం, అజయ్, సంధ్య, కావ్య, రాకేశ్, మహేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంపై ఎన్ఆర్ఐ మమకారం

రామాలయ నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం



సత్యనారాయణరెడ్డితో వీసీ ద్వారా మాట్లాడుతున్న గ్రామస్తులు

అశ్వాపురం: ఖండాలు దాటినా తన ఎదుగుదలకు ఊతమిచ్చిన ఊరికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న అశ్వాపురం మండలం మొండికుంటకు చెందిన కందిమళ్ల సత్యనారాయణరెడ్డి మరికొందరికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. గ్రామంలో రామాలయ నిర్మాణానికి గతంలో రూ.10 లక్షలు ఇచ్చిన ఆయన మంగళవారం మరో రూ.15 లక్షల విరాళం ప్రకటించారు. గతంలోనే గ్రామ పాఠశాల, ఆస్పత్రి, వృద్ధాశ్రమం, వైకుంఠధామం అభివృద్ధి, పంచాయతీ భవనం వద్ద విగ్రహాల ఏర్పాటుకు సైతం సహకరించారు. అయితే, రామాలయం నిర్మాణానికి నిధులు సరిపడా సమకూరకపోవడంతో ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామస్తులు మంగళవారం సమావేశం కాగా, అమెరికాలో ఉంటున్న సత్యనారాయణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి రూ.15 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించారు. అంతేకాక యాగశాల నిర్మాణం, ధ్వజస్తంభం, శ్రీ సీతారాముల వారి మహాప్రతిష్టాపన, అన్నదానానికి సైతం సహకరిస్తానని తెలపడంతో ఆయనను గ్రామస్తులు అభినందించారు. అలాగే, ఆలయ నిర్మాణానికి స్థానికుడైన కూసుకుంట్ల శ్రీనివాసరెడ్డి–శోభారాణి మంగళవారం రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. వీరు గతంలో రూ.25116 అందించగా, నిర్మాణ వ్యయం పెరగడంతో మరోమారు విరాళం ప్రకటించారు.

ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ సతీశ్‌కుమార్

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పాత ఏరియా స్టోర్స్ వద్ద గల నేతాజీ సుభాష్‌చంద్రబోస్ క్రీడా మైదానంలో పున్నం లక్ష్మి జ్ఞాపకార్థం ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఆక్షన్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి మణుగూరు సీఐ సతీశ్‌కుమార్ హాజరై మాట్లాడారు. గెలుపు, ఓటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం తుది పోరులో గెలిచిన సివిల్ లెవెన్ జట్టుకు రూ.30 వేల నగదుతో పాటు విన్నర్ ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన కల్యాణ్ లెవెన్ జట్టుకు రూ.20 వేలతో పాటు రన్నర్ ట్రోఫీని సీఐ అందజేశారు. కార్యక్రమంలో మణుగూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పిండిగ వెంకట్, కార్యదర్శి మార్తి శ్రీనివాసరావు, టోర్నమెంట్ నిర్వాహకులు ఉమామాస్టర్, శశికిరణ్, రంజిత్, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సైబర్ కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని వెంకటేశ్వరకాలనీకి చెందిన మాదిరెడ్డి సీత గత జనవరి 20న తన బ్యాంకు ఖాతాను పరిశీలించగా మూడు విడతల్లో రూ.60 వేలు విత్‌డ్రా అయినట్లు గుర్తించింది. వెంటనే సైబర్ క్రైం నంబర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. తనకు క్రెడిట్ కార్డు కూడా లేదని రూ.20 వేల చొప్పున మూడు సార్లు తన ఖాతా నుంచి వేరే ఖాతాల్లోకి ట్రాన్స్‌ఫర్ అయినట్లు బ్యాంక్ స్టేట్‌మెంట్లో గుర్తించినట్లు వివరించింది. తరువాత తన ఖాతాలో ఉన్న రూ.76 వేలు హోల్డ్‌లో పెట్టినట్లుగా తనకు సైబర్ క్రైం నుంచి మెస్సేజ్ వచ్చినట్లు తెలిపింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అవాంతరాలు లేని సరఫరాకు కృషి



దుమ్ముగూడెం: పర్ణశాల మిషన్ భగీరథ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్

దుమ్ముగూడెం/పాల్వంచరూరల్: వచ్చే వేసవిలో మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్ సప్లై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన భద్రాచలం నియోజకవర్గంలో పర్యటించి.. తొలుత పట్టణంలోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌తోపాటు దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాలలో ఉన్న ఇంటేక్ వెల్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ నళిని, బ్రహ్మదేవ్, ఉపేందర్, జాన్ అనన్య పాల్గొన్నారు. అలాగే, పాల్వంచ మండలంలోని తోగ్గూడెం సమీపంలో గల మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రాన్ని మంగళవారం సీఈ కె.శ్రీనివాస్ సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సదాశివకుమార్, డీఈ సాయిలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర నాటకోత్సవాలు ప్రారంభం



దేవరాగం నాటికలోని ఓ సన్నివేశం

భద్రాచలంటౌన్: భద్రాద్రి వేదికగా నిర్వహిస్తున్న 23వ అంతర్రాష్ట్ర నాటకోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాలను ముఖ్య అతిథి తాళ్లూరి పంచాక్షరయ్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదటి రోజు సౌజన్య కళాస్రవంతి ఉత్తరాంధ్ర వారి దేవరాగం నాటిక ఆకట్టుకుంది. అనంతరం ప్రముఖ రంగస్థల నటి, గాయిని మంగాదేవితో పాటు జానపద గాయకుడు రేలారేలా ఫేమ్ జానకీరావును సన్మానించారు. తర్వాత భాగ్యశ్రీ సాయి బృందం ఆధ్వర్యంలో జానపద హంగామా కార్యక్రమం ప్రేక్షకులను అలరించిది. కార్యక్రమంలో భద్రాద్రి కళాభారతి ఫౌండర్ అల్లం నాగేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతి, తిప్పన సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌కు గాయాలు

ములకలపల్లి: విద్యుదాఘాతంతో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు.. వేముకుంట గ్రామానికి చెందిన సోయం నరేశ్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సీతారాంపురం గ్రామానికి విద్యుత్ లైన్ల పనుల నిమిత్తం స్థానిక విద్యుత్‌శాఖ అధికారులు నరేశ్‌ను తీసుకెళ్లారు. విద్యుత్ లైన్ పనులు చేస్తుండగా పైన ఉన్న 11 కేవీ విద్యుత్‌లైన్ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. నరేశ్‌ను హుటాహుటిన కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



అవార్డు అందజేస్తున్న నాగేందర్

ఇల్లెందు: 108,102,1962 అంబులెన్స్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని 108 జిల్లా కో ఆర్డినేటర్ భూమా నాగేందర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన ఇల్లెందులో వాహనాలను తనిఖీ చేశారు. ఇల్లెందు 108 అంబులెన్స్‌లో పని చేస్తున్న పైలట్లు దోనకొండ సంజీవ, కోటి, వేణుకుమార్‌లకు స్టార్ పైలట్ అవార్డులు అందజేశారు. అంబులెన్స్‌ల మైలేజీతో పాటు పేషెంట్లను త్వరగా ఆస్పత్రులకు చేర్చడంలో కీలక పాత్ర పోషించినందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఈఎంటీ పూర్ణచందర్, సిబ్బంది సునిల్, కెప్టెన్ సాయి, సమత తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ రైలులో సాంకేతిక లోపం

సిగ్నల్ వద్ద 20 నిమిషాలు నిలిపివేత



గేట్ తెరవకపోవడంతో నిలిచిన వాహనదారులు

కారేపల్లి: భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) నుంచి డోర్నకల్ వైపు బొగ్గులోడుతో వెళ్తున్న గూడ్స్ రైలులో సాంకేతిక లోపం తలెత్తడమే కాక ఒక బోగీ నుంచి పొగ వెలువడటంతో అప్రమత్తమైన రైల్వే అధికారులు కారేపల్లి రైల్వేస్టేషన్ సమీపాన సిగ్నల్స్ వద్ద రైలును నిలిపేశారు. మంగళవారం బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు ఓ బోగీలో నుంచి పొగ వస్తుండగా ఇల్లెందు రైల్వేగేట్(2కేకే) వద్ద గేట్‌మెన్ గమనించాడు. ఆయన కారేపల్లి స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇవ్వగా లోకోపైలట్‌ను అప్రమత్తం చేసి పేరుపల్లి రైల్వే గేట్(1కేకే) దాటాక కారేపల్లి జంక్షన్ సమీపంలో వద్ద నిలిపివేశారు. అనంతరం రైల్వే అధికారులు పరిశీలించి పొగ తగ్గాక గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సుమారు 20నిమిషాల పాటు గూడ్స్ రైలు నిలిచిన కారణంగా ఇల్లెందు, పేరుపల్లి రైల్వేగేట్లను తెరవపోవడంతో ఇరువైపులా వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

ఇసుక నిల్వలు సీజ్



సీజ్ చేసిన ఇసుక చూపుతున్న భద్రు

ములకలపల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక రాశులను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గిర్దావర్–2 భద్రు కథనం మేరకు.. మండలంలోని ఆనందపురం శివారులోని రిసార్ట్స్ వెనుక ఇసుక డంప్ చేసినట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించి, సుమారు 8 ట్రాక్టర్ల ఇసుక సీజ్ చేసి, తహసీల్దార్ కార్యాలయానికి తరలించామని భద్రు వెల్లడించారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

దమ్మపేట: ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పార్కలగండి గ్రామ పంచాయతీ పరిధిలోని పాకలగూడెం గ్రామ శివారులో చోటు చేసుకోగా.. విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాకలగూడెం గ్రామానికి చెందిన మడకం లక్ష్మి (45) గత నెల (జనవరి) 20న గ్రామంలో జరిగిన ఓ ఫంక్షన్‌లో మద్యం తాగి, అతిగా ప్రవర్తించింది. విసుగు చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెను మందలించారు. దీంతో గ్రామ శివారులోని గుట్టపైన ఉన్న చెట్టుకు తన చీరతోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం నాడు ఆ గుట్టకు సమీపంలో పశువుల కాపర్లు, చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించి, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేటకు తరలించారు. మృతురాలి కుమారుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

బీఎస్పీకి కామేశ్ రాజీనామా



ఎర్రా కామేశ్

కొత్తగూడెంఅర్బన్: బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఎర్రా కామేశ్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. 2020 నవంబర్ 12వ తేదీన బీఎస్పీలో చేరారు. ఇటీవల ఇచ్చిన జన కల్యాణ్ దివస్ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగతంగా తనకు రూ.5 లక్షలు, ప్రతి అసెంబ్లీకి రూ.5 లక్షలు మొత్తం కలిపి రూ.10 లక్షలు లక్ష్యంగా విధించగా.. తాను లక్ష్యాన్ని చేరుకోలేకపోయినందుకు గాను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. లేఖను రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్‌కు పంపానని ఆయన ప్రకటనలో వివరించారు. కాగా, కామేశ్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున్‌రావు, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, వినయ్, సోను, బన్ను తదితరులు బీఎస్పీకి రాజీనామా చేశారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

కొణిజర్ల: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమాన లారీ రోడ్డు పక్కన బోల్తా పడింది. కొణిజర్లలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన వివరాలు... మహారాష్ట్రలోని బ్రహ్మపూర్ నుంచి చేపల ఎరువు లోడుతో ఏపీలోని భీమవరానికి లారీ వెళ్తోంది. కొణిజర్ల ఎంపీడీఓ కార్యాలయం సమీపాన ఎదురుగా వస్తున్న వాహనాన్ని డ్రైవర్ తప్పించే యత్నంలో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. డ్రైవర్ రాయుడు వెంకటేష్, క్లీనర్ చంద్రంకు గాయాలయ్యాయి. అయితే, అక్కడి కాల్వ పక్కన లారీ పడడంతో ఇరువురు ప్రమాదం నుంచి బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

ఐసీడీఎస్ జూనియర్ అసిస్టెంట్ మృతి



ఎండీ యాకూబ్ పాషా (ఫైల్)

దమ్మపేట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎండీ యాకూబ్ పాషా (48) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఆయన కల్లూరులోని నివాసంలో ఉండగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. కాగా, ఆయన 2022 నుంచి దమ్మపేటలో విధులు నిర్వర్తిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీడీపీఓ హేమసత్య ఆయన మృతదేహాన్ని సందర్శించి తక్షణ ఆర్థిక సాయంగా రూ.30,000 మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. సీడీపీఓతో పాటుగా సూపర్‌వైజర్లు శ్రీదేవి, నాగమణి, సామ్రాజ్యం, జ్ఞానసుందరి పాల్గొన్నారు.